# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | మంగళవారం 06, అక్టోబర్ | పేజీలు: 4 | వెల: రూ.1




## ఫామ్-6ను చట్టవిరుద్ధంగా మార్చారు

- లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ
- బీజేపీకి అనుకూలంగా నిర్ణయం తీసుకున్నారన్న ఆరోపణ
- జ్ఞానేశ్ కుమార్ పదవిని దుర్వినియోగం చేశారని విమర్శ
- ఫామ్-6 మార్పులను సుప్రీంకోర్టు ఆమోదించలేదన్న సీజేఐ
- ఎవరి అనుమతితో మార్చారో తెలుసుకునేందుకు రికార్డులు కోరిన కోర్టు
- ఈసీలో కీలక నిర్ణయాలపై కేంద్రానికి, ఈసీకి నోటీసులు
- ముగ్గురు ఈసీల సమ్మతి లేకుండా నిర్ణయాలు తీసుకున్నారా?
- నిర్ణయాలు ఏకగ్రీవమా.. మెజారిటీతోనా అని ప్రశ్న
- సీఈసీ ఒక్కడే నిర్ణయాలు తీసుకున్నారా?
- బాధ్యులైన వారందరినీ జవాబుదారీ చేస్తామన్న రాహుల్

2




## తెలంగాణలో 90 లక్షల ఓట్లు డిలీట్

- సర్ పేరుతో భారీ కుట్ర జరిగింది
- పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ ఆరోపణలు
- సర్ పేరుతో ఓటర్ల జాబితాలో అవకతవకలు
- ఓట్లు గల్లంతైన వారి హక్కులు కాపాడుతామని ప్రకటన
- ప్రజాసంఘాలు, ఎన్జీవోలు, కుల సంఘాలకు లేఖలు
- ఢిల్లీలో ఖర్గే, రాహుల్, వేణుగోపాల్ కీలక భేటీ
- రెండు నెలల పాటు నిరంతర కార్యక్రమాలకు నిర్ణయం
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ధర్నాలు, ర్యాలీలు
- కేంద్ర ప్రభుత్వ ఒత్తిడితోనే ఈసీ వ్యవహరిస్తోందని ఆరోపణ
- జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
- 6, 7 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు.. 8న లోక్‌భవన్ వద్ద ధర్నా

**హైదరాబాద్, (ప్రజాస్వరం):** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పేరుతో 90 లక్షల ఓట్లు తొలగించారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఓట్లు గల్లంతైన వారు తమ ఓటు హక్కును కాపాడుకునేలా రాష్ట్రంలోని ప్రజాసంఘాలు, ఎన్జీవోలు, కుల సంఘాలకు లేఖలు రాస్తామని తెలిపారు. సర్ ప్రక్రియలో అవకతవకలపై రానున్న రెండు నెలల పాటు నిరంతర కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు మహేశ్ గౌడ్ తెలిపారు. ఈ అంశంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అధ్యక్షతన ఢిల్లీలో కీలక సమావేశం మిగతా 2లో..

## గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలపై కాంగ్రెస్
# ఫోకస్

- నవంబర్‌లో ముగియనున్న ముగ్గురు ఎమ్మెల్సీల పదవీకాలం
- ఆశావహులపై కసరత్తు.. హైకమాండ్‌తో రాష్ట్ర నేతల చర్చలు
- కేబినెట్ భేటీలో పేర్లపై చర్చ.. రాజ్‌భవన్‌కు ప్రతిపాదనలు
- గవర్నర్ కోటా ఎమ్మెల్సీల భర్తీకి కాంగ్రెస్ వ్యూహం
- వచ్చే వారంలో అభ్యర్థులపై తుది కసరత్తు
- ఈ నెలాఖరులో కేబినెట్ ఆమోదం.. ఆ తర్వాత రాజ్‌భవన్‌కు
- ముగ్గురు స్థానాల కోసం కాంగ్రెస్‌లో ఆశావహుల హడావుడి
- హైకమాండ్ ఆమోదంతో ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికకు రంగం సిద్ధం
- సకాలంలో భర్తీకి ప్రభుత్వం వేగంగా అడుగులు
- ఎమ్మెల్సీ స్థానాలపై కాంగ్రెస్‌లో మొదలైన మంతనాలు



**హైదరాబాద్, (ప్రజాస్వరం):** తెలంగాణలో గవర్నర్ కోటా కింద ఖాళీ కానున్న శాసనమండలి (ఎమ్మెల్సీ) స్థానాల భర్తీకి కాంగ్రెస్ ప్రభుత్వం ముమ్మర కసరత్తు ప్రారంభించింది. ప్రస్తుతం గవర్నర్ కోటాలో ఉన్న ముగ్గురు ఎమ్మెల్సీల పదవీకాలం నవంబర్ మూడో వారంలో ముగియనుండటంతో, ఆ స్థానాలను సకాలంలో భర్తీ చేసేందుకు అధిష్టానం ప్రాథమిక వ్యూహాన్ని సిద్ధం చేస్తోంది. ఈ నెలాఖరులోగా జరగబోయే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఆశావహుల పేర్లపై సమగ్రంగా చర్చించి, ఆమోదించిన ప్రతిపాదనలను రాజ్‌భవన్‌కు మిగతా 2లో..




## ఫోన్ ట్యాపింగ్ కేసులో కోదండరెడ్డిని విచారించిన సిట్

- కార్యాలయానికి వెళ్లి 40 నిమిషాలకు పైగా ప్రశ్నలు
- వివిధ అంశాలపై వివరాలు సేకరణ
- కోదండరెడ్డి స్టేట్‌మెంట్ రికార్డు చేసిన అధికారులు
- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఆయన పేరు వెలుగులోకి
- ఇటీవల సిట్ నోటీసులు జారీ
- 2023 ఎన్నికల సమయంలో ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు గుర్తింపు
- కొన్ని నెలల పాటు ఫోన్‌ను ట్యాప్ చేసినట్లు దర్యాప్తులో వెల్లడి
- ట్యాపింగ్ వ్యవహారంపై కొనసాగుతున్న విచారణ
- కేసులో మరిన్ని వివరాలు సిట్ దర్యాప్తులో వెల్లడి కానున్నాయి

2

## సీఈసీపై చర్యలు తీసుకోలేం

- సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ
- వార్తాపత్రిక కథనం ఆధారంగా
- ఉత్తర్వులు ఇవ్వలేమని క్లారిటీ
- జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారా?
- మిగతా ఈసీల అధికారాలను సీఈసీ వినియోగించుకోవచ్చా?
- ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ
- నిర్ణయాలు ఏకగ్రీవమా.. మెజారిటీతోనా?
- వివరాలు సమర్పించాలని ఈసీకి ఆదేశం
- అక్రమం రుజువైతే తదుపరి చర్యలపై ఆదేశాలిస్తామన్న కోర్టు
- ఫామ్-6 మార్పులను ఆమోదించలేదన్న సుప్రీంకోర్టు



2

**హైదరాబాద్, (ప్రజాస్వరం):** 'సర్' అంశంలో ఎన్నికల సంఘంలో విభేదాలు ఏర్పడ్డాయంటూ వచ్చిన వార్తలపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఒక వార్తాపత్రికలో వచ్చిన కథనం ఆధారంగా ప్రధాన మిగతా 2లో..

## సింగరేణి కార్మికులకు దీపావళి కానుక

- ఒక్కొక్కరికి రూ.1,10,250 బోనస్
- దసరా, దీపావళి వేళ భారీ ప్రకటన
- కార్మికులకు శుభాకాంక్షలు తెలిపిన కిషన్‌రెడ్డి
- తెలంగాణకు సింగరేణి కొంగు బంగారమని వ్యాఖ్య
- బొగ్గు ఉత్పత్తి పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశం
- కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తామని హామీ
- ఉద్యోగ భద్రత, కుటుంబాల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి
- సింగరేణికి రావాల్సిన రూ.60 వేల కోట్ల బకాయిల విడుదలకు డిమాండ్
- బోనస్‌తో కార్మికుల్లో ఆనందోత్సాహాలు



**హైదరాబాద్, (ప్రజాస్వరం):** సింగరేణి కాలరీస్ సంస్థ కార్మికులకు దీపావళి పండుగ వేళ భారీ బోనస్ ప్రకటించారు. ఒక్కో కార్మికుడికి రూ.1,10,250 చొప్పున బోనస్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. దసరా, దీపావళి పండుగల సందర్భంగా ఈ ప్రకటన వెలువడటంతో కార్మిక వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సింగరేణి మిగతా 2లో..



## హనీట్రాప్‌తో రిటైర్డ్ ఉద్యోగికి టోకరా..

- మహిళ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతా
- రిటైర్డ్ ఉద్యోగితో పరిచయం పెంచుకున్న సైబర్ నేరగాడు
- అసభ్యకర చాటింగ్‌ను అడ్డుపెట్టుకుని బెదిరింపులు
- క్రిమినల్ కేసులు పెడతామంటూ భయపెట్టిన వైనం
- వివిధ కారణాలతో విడతల వారీగా డబ్బుల వసూలు
- హనీట్రాప్ పేరుతో ఏకంగా రూ.38 లక్షలు కాజేసినట్లు గుర్తింపు
- చాకచక్యంగా కేసును ఛేదించిన పోలీసులు

**హైదరాబాద్, (ప్రజాస్వరం):** హైదరాబాద్‌లో హనీట్రాప్ పేరుతో జరిగిన సైబర్ మోసం కేసును పోలీసులు ఛేదించారు. ఓ వయోవృద్ధ రిటైర్డ్ ఉద్యోగిని టార్గెట్ చేసిన సైబర్ నేరగాడు.. మహిళ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతా సృష్టించి బాధితుడితో పరిచయం పెంచుకున్నాడు. ఆ తర్వాత వివిధ రకాలుగా బెదిరించి ఏకంగా రూ.38 లక్షలు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. నిందితుడు మహిళ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ప్రొఫైల్‌ను సృష్టించి వయోవృద్ధ రిటైర్డ్ ఉద్యోగికి ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపాడు. బాధితుడితో పరిచయం పెంచుకుని నమ్మకం సంపాదించాడు. తొలుత గృహ అవసరాలు, ఇతర కారణాలను చెబుతూ డబ్బులు తీసుకున్నాడు. ఆ తర్వాత బాధితుడితో అసభ్యకరంగా చాటింగ్ చేసి, ఆ సంభాషణలను అడ్డుపెట్టుకుని బెదిరింపులకు పాల్పడ్డాడు. మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని బెదిరించాడు. పోలీసులమంటూ ఫోన్ కాల్స్ చేయడం, కేసులు పెడతామని భయపెట్టడం వంటి పద్ధతులతో బాధితుడి నుంచి దశలవారీగా భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. మొత్తంగా రూ.38 లక్షలు వసూలు చేసినట్లు కేసు దర్యాప్తులో వెల్లడైంది. మోసాన్ని గుర్తించిన బాధితుడు సైబర్ పోలీసులను మిగతా 2లో..

## సామాన్యుడిపై ధరల భారం.. ప్రభుత్వం
# నిద్రమత్తులో ఉందా?

- సన్నబియ్యం ధరలు నాలుగు నెలల్లో 25 శాతం పెరిగాయన్న హరీష్ రావు
- రైతుకు గిట్టుబాటు లేదు.. వినియోగదారుడికి అందుబాటు లేదని విమర్శ
- ఉల్లిపాయ, వెల్లుల్లి, పప్పుల ధరలపై ప్రభుత్వాన్ని నిలదీత
- బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలపై తక్షణ తనిఖీలకు డిమాండ్

**హైదరాబాద్, (ప్రజాస్వరం):** నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతూ సామాన్య పౌరుడి నడ్డి విరుస్తుంటే, వాటిని అదుపు చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంతో వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు హరీష్ రావు విమర్శించారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రభుత్వంపై విరుచుకుపడిన ఆయన, పౌరసరఫరాల శాఖ పర్యవేక్షణా రాహిత్యానికి సామాన్య ప్రజలే మూల్యం చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే సన్నబియ్యం ధరలు ఏకంగా 25 శాతం పెరగడం ప్రభుత్వ వైఫల్యానికి స్పష్టమైన నిదర్శనమని మండిపడ్డారు. రికార్డు స్థాయిలో పంట దిగుబడి సాధించామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం, ఉత్పత్తి పెరిగినప్పుడు మార్కెట్లో బియ్యం ధరలు ఎందుకు ఆకాశాన్ని అంటుతున్నాయో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ప్రభుత్వం రేషన్ ద్వారా ఇస్తున్న నాణ్యత లేని సన్నబియ్యాన్ని ప్రజలు వినియోగించడం లేదనడానికి, బయట మార్కెట్లో బియ్యం ధరలు అదుపు తప్పడమే ప్రధాన సాక్ష్యమని వ్యాఖ్యానించారు.

**రైతుకు గిట్టుబాటు లేదు.. వినియోగదారుడికి అందుబాటు లేదు**

ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతన్నకు మద్దతు ధర పేరిట నామమాత్రపు ధర మాత్రమే దక్కుతుంటే, మధ్యదళారులు మాత్రం క్వింటాకు రూ.8,000 పైమాటే లాభపడుతున్నారని హరీష్ రావు ఆరోపించారు. రైతుకు గిట్టుబాటు ధర దక్కక, ఇటు వినియోగదారుడికి అందుబాటు ధరలో సరుకులు అందక తీవ్ర అవస్థలు పడుతుంటే కేవలం మధ్యవర్తులు మాత్రమే కోట్లు కొల్లగొడుతున్నారని మిగతా 2లో..



# ఫామ్6ను చట్టవిరుద్ధంగా మార్చారు

- **లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ**
- **బీజేపీకి అనుకూలంగా నిర్ణయం తీసుకున్నారన్న ఆరోపణ**
- **జ్ఞానేశ్ కుమార్ పదవిని దుర్వినియోగం చేశారని విమర్శ**
- **ఫామ్-6 మార్పులను సుప్రీంకోర్టు ఆమోదించలేదన్న సీజేఐ**
- **ఎవరి అనుమతితో మార్చారో తెలుసుకునేందుకు రికార్డులు కోరిన కోర్టు**
- **ఈసీలో కీలక నిర్ణయాలపై కేంద్రానికి, ఈసీకి నోటీసులు**
- **ముగ్గురు ఈసీల సమ్మతి లేకుండా నిర్ణయాలు తీసుకున్నారా?**
- **నిర్ణయాలు ఏకగ్రీవమా.. మెజారిటీతోనా అని ప్రశ్న**
- **సీఈసీ ఒక్కడే నిర్ణయాలు తీసుకున్నారా?**
- **బాధ్యులైన వారందరినీ జవాబుదారీ చేస్తామన్న రాహుల్**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఉపయోగించే ఫామ్ 6లో మార్పులను జ్ఞానేశ్ కుమార్ చట్టవిరుద్ధంగా, బీజేపీకి అనుకూలంగా ఏకపక్షంగా చేశారని ఆరోపించారు.

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించిన ఫామ్ 6లో చేసిన మార్పులపై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఫామ్ 6లో చేసిన మార్పులను కోర్టు ఆమోదించలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు.

"మార్చిన ఫామ్ 6లో ఏదీ మేం ఆమోదించలేదు. ఎవరు మార్చారో రికార్డులు వచ్చిన తర్వాత చూడాలనుకుంటున్నాం" అని సీజేఐ వ్యాఖ్యానించారు. ఫామ్ 6ను ఎవరి అనుమతితో మార్చారో తెలుసుకునేందుకు సంబంధిత రికార్డులను సమర్పించాలని ఆదేశించారు.

ఈ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ స్పందించారు. ఫామ్ 6ను జ్ఞానేశ్ కుమార్ చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా మార్చారని ఆరోపించారు. ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ తన పదవిని దుర్వినియోగం చేసి బీజేపీకి ప్రయోజనం కలిగించేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

ఈ వ్యవహారంలో భాగమైన వారందరినీ బాధ్యులను చేస్తామని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

**ఈసీ నిర్ణయాలపైనా ప్రశ్నలు**

మరోవైపు ముగ్గురు ఎన్నికల కమిషనర్ల సమ్మతి లేకుండా ఎన్నికల సంఘంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారన్న పిటిషన్లపైనా సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంలో ఎన్నికల సంఘానికి, కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

ఎన్నికల సంఘం కీలక నిర్ణయాలు ఏకగ్రీవంగా తీసుకున్నారా? లేక మెజారిటీ ఆధారంగా నిర్ణయించారా? అనే వివరాలను కోర్టు కోరింది. ముగ్గురు ఎన్నికల కమిషనర్ల సమ్మతి లేకుండా కేవలం సీఈసీ మాత్రమే నిర్ణయాలు తీసుకున్నారా? అనే అంశంపైనా వివరాలు సమర్పించాలని ఆదేశించింది.

ఫామ్ 6 మార్పులకు సంబంధించిన రికార్డులు, ఎన్నికల సంఘంలో నిర్ణయాలు తీసుకున్న విధానంపై వివరాలు సమర్పించిన తర్వాత ఈ అంశాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కోదండరెడ్డిని విచారించిన సిట్

- **కార్యాలయానికి వెళ్లి 40 నిమిషాలకు పైగా ప్రశ్నలు**
- **వివిధ అంశాలపై వివరాలు సేకరణ**
- **కోదండరెడ్డి స్టేట్‌మెంట్ రికార్డు చేసిన అధికారులు**
- **ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఆయన పేరు వెలుగులోకి**
- **ఇటీవల సిట్ నోటీసులు జారీ**
- **2023 ఎన్నికల సమయంలో ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు గుర్తింపు**
- **కొన్ని నెలల పాటు ఫోన్‌ను ట్యాప్ చేసినట్లు దర్యాప్తులో వెల్లడి**
- **ట్యాపింగ్ వ్యవహారంపై కొనసాగుతున్న విచారణ**
- **కేసులో మరిన్ని వివరాలు సిట్ దర్యాప్తులో వెల్లడి కానున్నాయి**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

ఫోన్ ట్యాపింగ్ కేసులో కాంగ్రెస్ సీనియర్ నేత కోదండరెడ్డిని సిట్ అధికారులు విచారించారు. ఆయన కార్యాలయానికి వెళ్లిన అధికారులు దాదాపు 40 నిమిషాలకు పైగా వివిధ అంశాలపై ప్రశ్నించారు. అనంతరం ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు.

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కోదండరెడ్డి పేరు వెలుగులోకి రావడంతో ఇటీవల సిట్ అధికారులు ఆయనకు నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు ఆయనను విచారించినట్లు తెలుస్తోంది.

2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కోదండరెడ్డి ఫోన్ కొన్ని నెలల పాటు ట్యాప్ అయినట్లు సిట్ దర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం. ఈ వ్యవహారానికి సంబంధించి ఆయనకు తెలిసిన అంశాలు, ఫోన్ ట్యాపింగ్ జరిగిన కాలం, సంబంధిత పరిణామాలపై అధికారులు వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది.

కోదండరెడ్డి స్టేట్‌మెంట్‌ను నమోదు చేసిన సిట్.. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇతర అంశాలపైనా దర్యాప్తు కొనసాగిస్తోంది. విచారణలో వెల్లడైన వివరాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# సీఈసీపై చర్యలు తీసుకోలేం

**మొదటిపేజీ తరువాయి** ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై చర్యలు తీసుకోలేమని స్పష్టం చేసింది. అయితే సీఈసీ జ్ఞానేశ్ కుమార్.. మిగతా ఎన్నికల కమిషనర్లకు రాజ్యాంగబద్ధంగా కేటాయించిన అధికారాలను ఏకపక్షంగా వినియోగించుకున్నారా? అనే అంశాన్ని పరిశీలిస్తామని ధర్మాసనం తెలిపింది.ఈ వ్యవహారంపై ఎన్నికల సంఘం వివరణను ముందుగా తెలుసుకోవాలని పేర్కొంటూ ఈసీకి నోటీసులు జారీ చేసింది. ఎన్నికల సంఘంలో కీలక నిర్ణయాలు ఏకగ్రీవంగా తీసుకున్నారా? లేక మెజారిటీ ఆధారంగా తీసుకున్నారా? అనే వివరాలను సమర్పించాలని కోరింది.

**ఒక్క సీఈసీ నిర్ణయించారా?**

సీఈసీ ఒక్కరే కీలక నిర్ణయాలు తీసుకున్నారా? మిగతా ఇద్దరు ఎన్నికల కమిషనర్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నారా? అనే అంశాలను కూడా కోర్టు పరిశీలించనుంది. సీఈసీ ఏకపక్షంగా వ్యవహరించినట్లు రికార్డుల ద్వారా తేలితే.. తదుపరి చర్యలకు ఆదేశాలు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తామని ధర్మాసనం తెలిపింది.

**ఫామ్-6పై కీలక వ్యాఖ్యలు**

కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫామ్ 6లో చేసిన మార్పులపైనా సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది. మార్చిన ఫామ్ 6ను తాము ఆమోదించలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు.

"మార్చిన ఫామ్ 6లో ఏదీ మేం ఆమోదించలేదు. ఎవరు మార్చారో రికార్డులు వచ్చిన తర్వాత చూడాలనుకుంటున్నాం" అని సీజేఐ వ్యాఖ్యానించారు.

ఫామ్ 6లో మార్పులు ఎవరి అనుమతితో జరిగాయి? ఎవరు ఆదేశించారు? అనే విషయాలను తెలుసుకునేందుకు సంబంధిత రికార్డులను సమర్పించాలని కోర్టు కోరింది.

**13 కోట్ల ఓట్లపైనా పిటిషన్**

ఇదే అంశానికి సంబంధించిన ఇతర పిటిషన్లను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణకు స్వీకరించింది. 2025 జూన్ నుంచి 'సర్' ప్రక్రియలో భాగంగా పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో తొలగించినట్లు పేర్కొంటున్న 13 కోట్లకు పైగా ఓట్లపై ప్రత్యేక దర్యాప్తు జరపాలని పిటిషనర్లు కోరారు.

సీఈసీ నిర్ణయాలను రద్దు చేయాలని కూడా పిటిషనర్లు విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలపై ఎన్నికల సంఘం, కేంద్రం నుంచి వచ్చే వివరణలు, రికార్డులను పరిశీలించిన తర్వాత సుప్రీంకోర్టు తదుపరి నిర్ణయం తీసుకోనుంది.



# గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలపై కాంగ్రెస్ ఫోకస్

**మొదటిపేజీ తరువాయి**

పంపాలని ప్రభుత్వం యోచిస్తోంది. రానున్న వారంలో కాంగ్రెస్ హైకమాండ్ రాష్ట్ర ముఖ్య నేతలతో చర్చించి అభ్యర్థుల తుది జాబితాను ఖరారు చేసే అవకాశం ఉంది.

**సామాజిక వర్గాల ప్రాధాన్యం..**
**రేసులో నిలిచిన ప్రధాన పేర్లు**

ఈసారి ఎమ్మెల్సీ స్థానాల ఎంపికలో సామాజిక సమతుల్యతకు కాంగ్రెస్ నాయకత్వం పెద్దపీట వేయాలని భావిస్తోంది. గతంలో సిరిసిల్ల బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం ఒక స్థానాన్ని పద్మశాలి సామాజిక వర్గానికి కేటాయించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ వర్గం నుంచి స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ కుటుంబ సభ్యులతో పాటు కైలాస్ నేత, అనిల్ పేర్లు ప్రధానంగా ప్రచారంలో ఉన్నాయి. ఇక మిగిలిన రెండు స్థానాల్లో ఒకదానిని ఎస్సీ (మాదిగ) వర్గానికి కేటాయించాలని అధిష్ఠానం యోచిస్తుండగా, ఈ రేసులో దొమ్మాట సాంబయ్య, చారకొండ వెంకటేష్ పేర్లు ముందు వరుసలో ఉన్నాయి. అలాగే మూడో స్థానాన్ని బ్రాహ్మణ సామాజిక వర్గానికి కేటాయించే దిశగా పార్టీలో చర్చ జరుగుతుండగా, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.

**పరిశీలనలో మరికొందరు కీలక నేతలు**

కేవలం సామాజిక సమీకరణలే కాకుండా పార్టీకి, ప్రభుత్వానికి సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న మరికొందరు సీనియర్ నేతల పేర్లను కూడా కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్రంగా పరిశీలిస్తోంది. ఈ జాబితాలో సమాచార హక్కు



కమిషనర్ (RTI) అయోధ్య రెడ్డితో పాటు గాంధీ భవన్ ఇన్చార్జి కుమారావు పేర్లు కూడా ఉన్నట్లు సమాచారం. రాబోయే రాజకీయ పరిణామాలు, స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా సమర్థులైన అభ్యర్థులను ఖరారు చేసేందుకు పీసీసీ, అధిష్ఠానం చివరి విడత చర్చలు జరుపుతున్నాయి.

# ఈవీఎంపై అసత్య ప్రచారం

- **నెహ్రూ కుటుంబం నుంచి ప్రధాని లేకపోవడమే కారణం**
- **ఎన్నికలు అక్రమమైతే రేవంత్ రెడ్డి గెలుపు కూడా చట్టవిరుద్ధమే**
- **సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్**
- **కేరళ, హిమాచల్ సీఎంలూ రాజీనామా చేయాలని సవాల్**
- **ఈవీఎంలపై కాంగ్రెస్ వైఖరిని ప్రశ్నించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. నెహ్రూ కుటుంబానికి చెందిన వ్యక్తి ప్రధాని కావడం లేదనే అసంతృప్తితో కాంగ్రెస్ నేతలు భాజపాపై ఆరోపణలు చేస్తున్నారని ఆయన అన్నారు. భాజపా అక్రమంగా ఎన్నికల్లో గెలుస్తోందంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన పదాధికారుల సమావేశంలో రామచందర్‌రావు మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు చెబుతున్నట్లుగా ఎన్నికలు అక్రమంగా జరిగితే.. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కూడా చట్టవిరుద్ధంగానే గెలిచినట్లవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. అలాంటప్పుడు సీఎం పదవికి రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

కేరళ, హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రులు కూడా రాజీనామా చేయాలని సవాల్ విసిరారు. ఎన్నికల్లో గెలిచినప్పుడు ఈవీఎంలు మంచివని, ఓడిపోయినప్పుడు అవే ఈవీఎంలు మంచివి కావని కాంగ్రెస్ భావిస్తోందా? అని ప్రశ్నించారు.

''గతంలో కేసీఆర్ కుటుంబం, ఇప్పుడు రేవంత్ బ్రదర్స్ బాగుపడుతున్నారు తప్పితే తెలంగాణ ప్రజలు మాత్రం బాగుపడడం లేదు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవు. కానీ దిల్లీకి మూటలు పంపడానికి ఉన్నాయా?'' అని రామచందర్‌రావు ప్రశ్నించారు. తెలంగాణలో భాజపాను అధికారంలోకి తీసుకురావడానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# హనీట్రాప్‌తో రిటైర్డ్ ఉద్యోగికి టోకరా..

**మొదటిపేజీ తరువాయి**

ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాల ఆధారంగా నిందితుడిని గుర్తించిన పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు.

ఈ కేసులో పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన 26 ఏళ్ల యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నకిలీ సోషల్ మీడియా ఖాతాలు, ఫోన్ కాల్స్, చాటింగ్ ద్వారా బాధితుడిని ఎలా ట్రాప్ చేశాడనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఈ ఘటన నేపథ్యంలో వృద్ధులను లక్ష్యంగా చేసుకుని నకిలీ సోషల్ మీడియా ఖాతాలతో సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఘటనలు పెరుగుతున్నాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా మహిళల పేరుతో ఫేక్ ప్రొఫైల్స్ సృష్టించి ఫ్రెండ్ రిక్వెస్టులు పంపడం, పరిచయం పెంచుకుని నమ్మకం సంపాదించడం, ఆ తర్వాత వైద్యం, గృహ అవసరాలు, బహుమతులు వంటి కారణాలతో డబ్బులు డిమాండ్ చేయడం వంటి పద్ధతులను నేరగాళ్లు అనుసరిస్తున్నారని తెలిపారు.

డబ్బులు ఇచ్చిన తర్వాత లైంగిక వేధింపుల కేసులు, క్రిమినల్ కేసుల పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్నారని పోలీసులు పేర్కొన్నారు. కొందరు నిందితులు పోలీసులమంటూ ఫోన్ చేసి బాధితులను భయపెట్టి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ కేసులో నిందితుడిపై ఐటీ చట్టంలోని 66సి, 66డి సెక్షన్లతో పాటు 308(2), 318(4), 319(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. సోషల్ మీడియాలో పరిచయం లేని వ్యక్తుల ఫ్రెండ్ రిక్వెస్టులను అంగీకరించే విషయంలో జాగ్రత్తగా ఉండాలని, బెదిరింపులకు భయపడి డబ్బులు చెల్లించకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.




# తూప్రాన్ లో వ్యవసాయ విద్యుత్ కోతలపై రైతుల ఆగ్రహం

**తూప్రాన్ అక్టోబర్ 05(ప్రజా స్వరం):**

మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని నాచారం, అల్లాపూర్ ఫీడర్లకు చెందిన రైతులు వ్యవసాయం (AGL) కరెంటు కోతలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పంటలకు సకాలంలో నీరు అందించలేక నష్టపోతున్నామని, వెంటనే కోతలు లేకుండా పూర్తిస్థాయిలో కరెంటు సరఫరా చేయాలని 30 మంది రైతులు కలిసి విద్యుత్ శాఖ ఏఈ, డీఈ లకు వినతి పత్రం అందించారు.

డిమాండ్ నెరవేర్చకపోతే పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని రైతులు హెచ్చరించారు.




# తెలంగాణలో 90 లక్షల ఓట్లు డిలిట్

**మొదటిపేజీ తరువాయి**

జరిగిందని చెప్పారు.

**జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా..**

కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నామని మహేశ్ గౌడ్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఒత్తిడితోనే ఎన్నికల కమిషనర్ వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు.

జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండాలని రాహుల్ గాంధీ చెప్పారని పేర్కొన్నారు.

**రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు..**

ఈ నెల 6, 7 తేదీల్లో గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు టీపీసీసీ ఆధ్వర్యంలో ధర్నాలు,



ర్యాలీలు నిర్వహిస్తామని మహేశ్ గౌడ్ తెలిపారు. అక్టోబరు 8న లోక్‌భవన్ ఎదుట ఆందోళన చేపడతామని వెల్లడించారు.

# సింగరేణి కార్మికులకు దీపావళి కానుక

**మొదటిపేజీ తరువాయి**

కార్మికులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి సంస్థ తెలంగాణకు కొంగు బంగారమని పేర్కొన్నారు. సింగరేణి కేవలం బొగ్గు ఉత్పత్తి సంస్థ మాత్రమే కాదని.. తెలంగాణ ఆర్థిక పురోగతిలో కీలకమైన సంస్థ అని అన్నారు.

**బొగ్గు ఉత్పత్తి పెంచాలి**

సింగరేణి భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని బొగ్గు ఉత్పత్తిని మరింత పెంచేందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను కిషన్‌రెడ్డి ఆదేశించారు. సంస్థను మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం**

సింగరేణి కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భద్రత, ఉద్యోగ భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సంస్థ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అన్నారు.

**రూ.60 వేల కోట్ల బకాయిలు**

సింగరేణికి రావాల్సిన సుమారు రూ.60 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సంస్థ ఆర్థికంగా బలోపేతం కావడానికి బకాయిల విడుదల అవసరమని పేర్కొన్నారు. మరోవైపు దసరా, దీపావళి పండుగల వేళ రూ.1,10,250 బోనస్ ప్రకటించడంతో సింగరేణి కార్మికుల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి.

# సామాన్యుడిపై ధరల భారం.. ప్రభుత్వం నిద్రమత్తులో ఉందా?

**మొదటిపేజీ తరువాయి**

ధ్వజమెత్తారు. కళ్లముందే ఈ దోపిడీ జరుగుతున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం శోచనీయమన్నారు. బియ్యం మాత్రమే కాకుండా ఉల్లిపాయలు రూ.70, వెల్లుల్లి రూ.240, పల్లి నూనె రూ.210, పెసరపప్పు రూ.125, కంది పప్పు రూ.165 కు చేరుకోవడంతో సామాన్య కుటుంబాల వంటింటి బడ్జెట్ పూర్తిగా తలకిందులైందని తెలిపారు.

**బ్లాక్ మార్కెటింగ్‌పై తక్షణమే దాడులు చేయాలని డిమాండ్**

ధరల పర్యవేక్షణను గాలికి వదిలేసి ప్రభుత్వం కేవలం ప్రేక్షక పాత్ర పోషిస్తోందని హరీష్ రావు మండిపడ్డారు. వ్యాపారులు సృష్టిస్తున్న కృత్రిమ కొరత, అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్ , అధిక మార్జిన్లపై తక్షణమే తనిఖీలు నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకుని సన్నబియ్యం సహా అన్ని నిత్యావసరాల ధరలకు అడ్డుకట్ట వేసి, పెరుగుతున్న ధరల భారం నుంచి సామాన్యుడికి ఉపశమనం కల్పించాలని ఆయన స్పష్టం చేశారు.

# మెదక్ జిల్లా కలెక్టర్ ను కలిసిన రెడ్ క్రాస్ ప్రతినిధులు

- **మెదక్ జిల్లా కలెక్టర్ ను కలిసిన రెడ్ క్రాస్ ప్రతినిధులు ...**

**తూప్రాన్ అక్టోబర్ 05(ప్రజా స్వరం)**

మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ను రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు లయన్ డాక్టర్ జానకిరామ్ సీఆర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ కు పుష్పగుచ్ఛం, శాలువా అందజేసి సత్కరించారు. రెడ్‌క్రాస్ సభ్యులు లయన్ జానకిరామ్ గౌడ్ మాట్లాడుతూ.... నా పై నమ్మకం తో భారీగా ఓట్లు వేసి గెలిపించిన ప్రతిఒక్కరికి ధన్యవాదములు తెలియజేశారు..

రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలకు ప్రణాళిక డాక్టర్ జానకిరామ్ మెదక్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టిన లయన్ డాక్టర్ సి.ఆర్. జానకిరామ్ జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

ఇందులో భాగంగా మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి భవిష్యత్ కార్యాచరణను వివరించారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి నెలా ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఫస్ట్ ఎయిడ్ శిక్షణ, జూనియర్ రెడ్ క్రాస్, యూత్ రెడ్ క్రాస్ యూనిట్ల ఏర్పాటు, రోడ్డు భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు అయన తెలిపారు.

అలాగే ప్రకృతి విపత్తులు, వరదలు, అగ్ని ప్రమాదాల సమయంలో బాధితులకు అండగా నిలవడం, వృద్ధులు, అనాథలకు సహాయం అందించడం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు పంపిణీ వంటి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టనున్నట్లు డాక్టర్ జానకిరామ్ తెలిపారు. రెడ్ క్రాస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.






## జాతీయ స్థాయి "ప్రేరణ "కి ఎంపికైన గీతా స్కూల్ విద్యార్థిని

**తూప్రాన్ అక్టోబర్ 05 (ప్రజా స్వరం ) ప్రతినిధి**



భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ప్రారంభించిన "ప్రేరణ 2.0" కార్యక్రమానికి మెదక్ జిల్లా తూప్రాన్ గీతా స్కూల్ పదవ తరగతి విద్యార్థిని బి. మహతి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జి. అరుణ తెలియజేశారు. 912 వ తరగతి చదువుతున్న విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం మరియు విలువలతో కూడిన విద్యను అందించడం ప్రధాన లక్ష్యంగా మెదక్ జిల్లా విద్యాశాఖధికారి పర్యవేక్షణలో మెదక్ జిల్లా జిల్లా పరిషద్ బాలికోన్నత పాఠశాలలో జరిగిన ఎంపిక కార్యక్రమంలో అత్యంత ప్రతిభను కనబరచిన మహతి గుజరాత్ రాష్ట్రంలోని మెహెసానా జిల్లా వడ్నగర్ లో ఉన్న వెర్నాక్యులర్ పాఠశాలలో నివాస శిక్షణ శిబిరంలో పాల్గొనడానికి సిద్ధమవుతున్నట్లు ప్రిన్సిపాల్ అరుణ తెలిపారు.అక్కడ భారత ప్రధాని మాననీయ నరేంద్ర మోదీజీ చదువుకున్న పాఠశాలతో పాటు ఐ. ఐ. టి గాంధీనగర్ ను సైతం సందర్శిస్తారని ఆమె తెలిపారు. నాయకత్వ వికాసం, దేశ సంస్కృతిపై అవగాహన, వారసత్వం, చరిత్ర లాంటి వైవిధ్యమైన అంశాలను విద్యార్థులలో ప్రోదిచేయడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమని ఆమె తెలియజేశారు.

ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ పి. రామాంజనేయులు, చైర్ పర్సన్ పి. ఉష, డైరెక్టర్లు బి. రాఘవేందర్ గౌడ్, నారాయణ గుప్తా, భరత్, డాక్టర్ మౌనిక, ఇంచార్జి ప్రిన్సిపాల్ ప్రేంరాజ్ మరియు ఉపాధ్యాయులు మహతిని అభినందించారు.

## బజరంగ్ నగర్ కాలనీలో సిసి రోడ్ పనులు ప్రారంభం

**జవహర్ నగర్ అక్టోబర్ 5(ప్రజాస్వరం):**

జవహర్ నగర్ డివిజన్ పరిధిలోని బజరంగ్ నగర్ కాలనీలోని 34 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు పనులను సోమవారం జవహర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షురాలు శాంతి కోటేష్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని అన్నారు .భజరంగ్ కాలనీలో 34లక్షల రూపాయలతో 430 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు బల్లి శ్రీనివాస్ ,మాజీ కోఆప్షన్ సభ్యులు శ్వేతా ముకేశ్, శోభారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు సంగారెడ్డి మనోదర్ రెడ్డి భజరంగ్ కాలనీ అధ్యక్షులు ఇంద్రాసేన రావు, రాజేష్, గడ్డం శ్రీనివాస్, గార ఉపేందర్ ,అంగడి బాలరాజ్ నరేష్, అంగడి కృష్ణ సుబ్బారావు కాలనీ వాసులు పాలుగోన్నారు.



## నీట్‌లో ఉత్తమ ప్రతిభ..

- **ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు..**

**చిన్నశంకరంపేట ( ప్రజా స్వరం ) అక్టోబర్ 05**



చిన్నశంకరంపేట మండల కేంద్రానికి చెందిన కుమ్మరి స్వప్న శ్రీనివాస్ దంపతుల కుమార్తె మనోజ్ఞశ్రీ ఇటీవల నిర్వహించిన నీట్ పరీక్షలో ప్రతిభ కనబరిచి మంచి ర్యాంకు సాధించింది. ఈ ప్రతిభతో జనగామ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సంపాదించింది. చిన్ననాటి నుంచే డాక్టర్ కావాలనే లక్ష్యంతో మనోజ్ఞశ్రీ కష్టపడి చదువుతూ, పట్టుదలతో ముందుకు సాగింది. నీట్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించడంతో ఆమె కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో వైద్య విద్యలో ప్రవేశాలకు తీవ్ర పోటీ నెలకొన్న నేపథ్యంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించడం అంత సులభం కాదని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో వైద్య విద్యకు భారీగా ఖర్చు చేయాల్సిన పరిస్థితుల్లో, మనోజ్ఞశ్రీ తన ప్రతిభతో నీట్ లో ర్యాంకు సాధించి ప్రభుత్వ కళాశాలలో సీటు పొందడం అభినందనీయమని పేర్కొన్నారు. తమ కుమార్తె కష్టపడి చదివి డాక్టర్ కావాలనే తన లక్ష్యానికి తొలి అడుగు వేసిందని, జనగామ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించడం తమ కుటుంబానికి ఎంతో గర్వకారణంగా, ఆనందంగా ఉందని శ్రీనివాస్-స్వప్న దంపతులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మనోజ్ఞశ్రీని కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు అభినందించి భవిష్యత్తులో మరింత ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు.




## శేరిపల్లి గౌడ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక..

- **అధ్యక్షుడిగా జంగం నర్సింలు గౌడ్..**
- **ప్రధాన కార్యదర్శిగా సంధిగారి జయరాం గౌడ్ ఎన్నిక..**

**నార్సింగి ( ప్రజా స్వరం ) అక్టోబర్ 05**

నార్సింగి మండలం శేరిపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. గౌడ సంఘం సభ్యుల సమక్షంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో నూతన అధ్యక్షులుగా జంగం నర్సింలు గౌడ్, ప్రధాన కార్యదర్శిగా సంధిగారి జయరాం గౌడ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా స్వామి గౌడ్, కార్యదర్శిగా నాగులగారి మధుగౌడ్, కోశాధికారులుగా తాళ్ల వెంకట్ గౌడ్, అజయ్ గౌడ్ ఎన్నికయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా సంధిగారి శ్రీనివాస్ గౌడ్, వెంకటస్వామి గౌడ్, రామా గౌడ్, చిన్న చంద్రం గౌడ్, వెంకట్ గౌడ్, పాపా గౌడ్, చిన్న రామా గౌడ్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని గౌడ సంఘం సభ్యులు శాలువాలు కప్పి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాళ్ల రవీందర్ గౌడ్, కృష్ణ గౌడ్, చిన్న కృష్ణ గౌడ్, సంధిగారి చంద్రం గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు జంగం నర్సింలు గౌడ్, ప్రధాన కార్యదర్శి సంధిగారి జయరాం గౌడ్ మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి సంఘం బాధ్యతలను అప్పగించిన గౌడ సంఘం సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. గౌడ కులస్తులందరినీ కలుపుకొని ఐకమత్యంతో ముందుకు సాగుతామని చెప్పారు. గౌడ కులస్తుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి గౌడ కులస్తులకు అందే వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. అదేవిధంగా గౌడ సంఘం అభివృద్ధితో పాటు సంఘానికి సంబంధించిన ఆలయ అభివృద్ధికి కూడా ప్రాధాన్యతనిస్తూ అందరి సహకారంతో కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం రెండు సంవత్సరాల పాటు కొనసాగుతుందని వారు తెలిపారు. సంఘంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత విభేదాలకు, ఐక్యతకు భంగం కలిగించే విషయాలకు దూరంగా ఉంటూ కలిసికట్టుగా ముందుకు సాగాలని కోరారు. గౌడ సంఘం అభివృద్ధి కోసం సభ్యులందరూ తమ సహకారాన్ని అందించాలని, పెద్దలు, యువత సమన్వయంతో పనిచేస్తే సంఘాన్ని మరింత బలోపేతం చేయవచ్చని వారు పేర్కొన్నారు. గౌడ సంఘం సభ్యుల సంక్షేమం, ఐక్యత, అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా నూతన కార్యవర్గం పనిచేస్తుందని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్పష్టం చేశారు. నూతన కార్యవర్గం ఎన్నికతో శేరిపల్లి గౌడ





సంఘం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని సభ్యులు ఆకాంక్షించారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న బాలికకు ఆర్థిక సహాయం

**జవహర్ నగర్, సెప్టెంబర్ 5, (ప్రజాస్వరం):**

జవహర్ నగర్ కు చెందిన బండి వర్షిని అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది వర్షిని కుటుంబ సభ్యులకు చికిత్స చేసేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో విషయం తెలుసుకున్న జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ మేకల కావ్య సోమవారం కుటుంబ సభ్యులను పరామర్శించి 25 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నేతలు బండ కింది ప్రసాద్ గౌడ్, తాంద్ర జలంధర్, మహమ్మద్ ఖాసిం, కాలనీవాసులు రమేష్, హరిబాబు, అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.






## శేరిపల్లిలో మహిళా సమైక్య భవనానికి భూమి పూజ..

**నార్సింగి ( ప్రజా స్వరం ) అక్టోబర్ 05**

నార్సింగి మండలంలోని శేరిపల్లి గ్రామంలో మహిళా సమైక్య భవన నిర్మాణానికి సోమవారం భూమి పూజ కార్యక్రమాన్ని ఐకేపీ ఏపీఎం సృజన్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ సంతోష ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యుల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, సంఘ కార్యకలాపాలను నిర్వహించేందుకు అనువుగా ఈ భవనాన్ని నిర్మించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలను సంఘటితం చేసి, వారికి ఆర్థిక స్వావలంబన కల్పించడంతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడంలో మహిళా సమైక్య సంఘాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. మహిళా సంఘాల సభ్యులు సమావేశాలు నిర్వహించుకోవడానికి వివిధ అంశాలపై చర్చించుకోవడానికి, ప్రభుత్వ పథకాలపై అవగాహన పొందేందుకు ఈ భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ భవనం వేదికగా నిలుస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగడంతో పాటు కుటుంబ, గ్రామ అభివృద్ధిలో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంతోషా గొండ స్వామి, ఏపీఎం సృజన్ కుమార్ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, సీసీ శోభా, మండల సమైక్య అధ్యక్షురాలు కందరి నవనీత ప్రభాకర్, ఉప సర్పంచ్ విజయ్ కుమార్, వార్డు సభ్యులు అరుణ్ యాదవ్, నవీన్ కుమార్, మానస కుమార్, జంగర్ల మురళి, మనస నవీన్, మల్లేశం, శ్రీనివాస్, మహిళా సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ గ్రామ ఉపాధ్యక్షుడు కందరి బాబు, కాంగ్రెస్ పార్టీ కోశాధికారి రాయిని భాను ప్రసాద్, గ్రామస్తులు రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా సమైక్య భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి మహిళా సంఘాలకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరారు





## వైభవం షాపింగ్ మాల్ ప్రారంభం.

- **ప్రారంభించిన సినీతార ఫారియా అబ్దుల్లా... ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు**

**మెదక్, అక్టోబర్ 05 (ప్రజా స్వరం)**

మెదక్ జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైభవం షాపింగ్ మాల్ సోమవారం ప్రారంభమైంది. మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్, సినీతార ఫారియా అబ్దుల్లా చేతుల మీదుగా మాల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్ మాట్లాడుతూ.. షాపింగ్ మాల్స్ ఏర్పాటుతో స్థానిక యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు మెదక్ పట్టణ అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. ప్రజలు దుస్తులు, ఇతర వస్తువుల కొనుగోళ్ల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే వివిధ రకాల వస్తువులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. వైభవం షాపింగ్ మాల్ కు మెదక్ తో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా వచ్చి షాపింగ్ చేసే అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వ్యాపార కార్యకలాపాలు పెరగడం ద్వారా పట్టణ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. ప్రారంభోత్సవం అనంతరం మాల్ యాజమాన్యం ఎమ్మెల్యే రోహిత్ తో పాటు అతిథులను ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు జుబేర్ అహ్మద్, గంట సంపత్, దొంతి లక్ష్మి ముత్యం గౌడ్, హరిత, కోఆప్షన్ సభ్యులు తాహెర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.







## కాస్లాపూర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం..

- **ట్రావెల్ బస్సు ఢీకొని ఇద్దరు అక్కడికక్కడే మృతి.**

**నార్సింగి ( ప్రజా స్వరం ) అక్టోబర్ 05**

మెదక్ జిల్లా నార్సింగి మండల పరిధిలోని జాతీయ రహదారి-44పై కాస్లాపూర్ వద్ద సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హోండా యాక్టివా ద్విచక్ర వాహనాన్ని ట్రావెల్ బస్సు ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఓ మహిళపై నుంచి బస్సు వెళ్లడంతో ఆమె తలకు తీవ్ర గాయాలై పరిస్థితి విషమంగా మారి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. మరో వ్యక్తి కూడా ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను పరిశీలించారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు, మృతుల వివరాలు పోలీసుల దర్యాప్తు అనంతరం తెలియాల్సి ఉంది.

## నన్ను ప్రజలే స్టార్‌ని చేశారు..

విజయ్ సీఎం అయిన తర్వాత.. తమిళనాడు రాజకీయాల్లోకి వచ్చేందుకు పలువురు సినీ నటులు ఆసక్తి చూపిస్తున్నారు. తాజాగా ఈ జాబితాలోకి శివకార్తికేయన్ (Sivakarthikeyan) చేరారు. తన అభిమానులతో సమావేశమయ్యారు. ఆదివారం చెన్నైలోని పోరూర్‌లో నిర్వహించిన ఈ సమావేశానికి సుమారు 3 వేల మంది అభిమానులు, ఫ్యాన్స్ అసోసియేషన్ నిర్వాహకులు హాజరయ్యారు.

"నేను పీపుల్ మేడ్ స్టార్‌ని. మీ వల్లే ఈ స్థాయికి వచ్చాను. ఏ రంగంలోనైనా మన లక్ష్యంపై క్లారిటీ ఉండాలి. విమర్శించే వాళ్లు ఎప్పుడూ విమర్శిస్తూనే ఉంటారు. వారిని పట్టించుకోకుండా మనందరం ప్రేమతో కలిసి ఉండాలి" అని అభిమానులకు శివకార్తికేయన్ సూచించారు. ఇక ఈ సమావేశానికి హాజరైన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. "బాగా చదవండి. బాగా సంపాదించండి. కుటుంబానికే మొదటి ప్రాధాన్యత ఇవ్వండి. మనం ఎంత ఎక్కువ చదివితే.. మన ఆలోచనా విధానం అంత మెరుగవుతుంది. దీని వల్ల సోషల్ మీడియాకూ దూరంగా ఉండొచ్చు" అని అన్నారు.



యంగ్ బ్యూటీ పూజిత పొన్నాడ ప్రధాన పాత్రలో నటిస్తున్న సరికొత్త హారర్ థ్రిల్లర్ చిత్రానికి సంబంధించిన క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. 'కమిటీ కుర్రోళ్లు' సినిమాతో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్న యువ నటుడు ఈశ్వర్ రాచిరాజు ఈ చిత్రంతో సోలో హీరోగా టర్న్ అవుతున్నారు. అలాగే ఈ సినిమాలో నందు లిఖిత మరో కీలక పాత్రలో కనిపించబోతున్నారు. 'ఎస్‌ఆర్ కళ్యాణమండపం' లాంటి విజయవంతమైన సినిమాకు దర్శకత్వం వహించిన శ్రీధర్ గాదె ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. శ్రీ ఐశ్వర్య లక్ష్మి మూవీస్ బ్యానర్‌పై ప్రొడ్యూసర్ వెంకట్ తలారి ఈ సినిమాను ప్రొడక్షన్ నెం.3గా నిర్మిస్తున్నారు. ఇటీవల పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైన ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది.

ఈ నేపథ్యంలోనే నేడు హీరోయిన్ పూజిత పొన్నాడ పుట్టినరోజు కావడంతో, మేకర్స్ ఆమెకు స్పెషల్ విషెస్ చెబుతూ సినిమాలో ఆమె పాత్రకు సంబంధించిన కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో ఆమె 'నర్తకి' అనే శక్తివంతమైన పాత్రలో నటిస్తున్నట్లు వెల్లడించారు. పూజిత పొన్నాడకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, రాబోయే ఏడాది ఆమెకు నిరంతర విజయాలను, మరిన్ని అద్భుతమైన మైలురాళ్లను అందించాలని కోరుకుంటున్నట్లు చిత్ర బృందం పేర్కొంది. పూర్తిగా విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో ఒక సరికొత్త హారర్ థ్రిల్లర్‌గా ఈ సినిమా రూపొందుతోంది. అయితే ఇందులో పూజిత పొన్నాడతో పాటు సింధు కాసారం, సురేష్ గురు, రాయల్ శ్రీ, మట్టా శివకుమార్, విహా దికొండ, సునీత మనోహర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. విలేజ్ నేటివిటీకి హారర్ ఎలిమెంట్స్ జోడించి తెరకెక్కిస్తున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి.



## విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో పూజిత పొన్నాడ హారర్ థ్రిల్లర్..

## తలరాతను తిరగరాసే సామాన్యుడి కథగా 'సింగారం'..

కోలీవుడ్ స్టార్ కమెడియన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యోగిబాబు, వరుస కామెడీ సినిమాలతో ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తూ విపరీతమైన పాపులారిటీ సంపాదించుకున్నారు. స్టార్ హీరోల చిత్రాల్లో ఇంపార్టెంట్ రోల్స్ చేస్తూనే, ఇప్పుడు తన రూట్‌ను పూర్తిగా మార్చేశారు. కేవలం కమెడియన్‌గానే కాకుండా పూర్తిస్థాయిలో హీరోగా మారి సినిమాలు చేస్తూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'సింగారం'. ఒక మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. కేవీ కదిరివేలు దర్శకత్వంలో తెరకెక్కుతుండగా.. చార్లీ, రెడిన్ కింగ్స్లీ, వైజీ మహేంద్రన్ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు.

రాక్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రమణ బాలాజీ, పద్మావతి గాంధీ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ సినిమా, విడుదలకు సిద్ధమైంది. ఈ విషయాన్ని తాజాగా, యోగిబాబు ట్విట్టర్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా యోగిబాబు ఒక ఆసక్తికరమైన పోస్ట్ పెట్టారు. "ప్రపంచం లొంగిపోవాలని కోరినప్పుడు.. అతను ధైర్యాన్ని ఎంచుకుంటాడు.. తన తలరాతనే తానే తిరగరాస్తాడు" అంటూ ఒక సామాన్యుడి అద్భుతమైన ప్రయాణంగా ఈ సినిమా రాబోతున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఈ చిత్రాన్ని అక్టోబర్ 30న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు.



## ఎట్టకేలకు ఆ జానపద గాథ మీ ముందుకు రాబోతుంది..



టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్‌ఇండియా మూవీ 'రణబాలి'. ఈ సినిమా అక్టోబర్ 16న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రాబోతుండటంతో, చిత్రబృందం వరుస అప్‌డేట్స్‌తో సినిమాపై అంచనాలను విపరీతంగా పెంచేస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన ఫస్ట్ సాంగ్ సరికొత్త రికార్డులు సృష్టిస్తూ సోషల్ మీడియాను షేక్ చేయగా.. తాజాగా విజయ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మరో బిగ్ అప్‌డేట్‌ను మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్ విడుదల తేదీని చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది.

ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. విజయ్ దేవరకొండ వెనుక వైపున కత్తిని వేసుకుని, పిడికిలి బిగించి రక్తం కారుతున్నా ఏమాత్రం పట్టించుకోకుండా తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతున్న రౌడీ హీరో ఇంటెన్స్ లుక్ అందరినీ ఆకట్టుకుంటోంది. "ఆ జానపద గాథ ఎట్టకేలకు అక్టోబర్ 8న వెల్లడి కానుంది. శాపగ్రస్త భూమికి సంబంధించిన గాథ రాబోతుంది" అనే పవర్‌ఫుల్ క్యాప్షన్ జత చేశారు. టాలెంటెడ్ డైరెక్టర్ రాహుల్ సంకృత్యన్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తుండగా.. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, రవిశంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. 19వ శతాబ్దంలో బ్రిటిష్ పాలన, అప్పట్లో ఉన్న కరువు పరిస్థితులు, స్వాతంత్ర్య ఉద్యమ నేపథ్యంలో ఈ కథ సాగనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు అజయ్ అతుల్ సంగీతం అందిస్తున్నారు. విజయ్, రష్మిక జోడీలో వస్తున్న ఈ భారీ చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి.

ముంబయిలో ఇటీవల జరిగిన ఆదాయ పన్ను (ఐటీ) శాఖ దాడులతో తనకెలాంటి సంబంధం లేదని నటి రకుల్ ప్రీత్‌సింగ్ (Rakul Preet Singh) స్పష్టం చేశారు. విదేశీ నిధుల మళ్లింపు ఆరోపణలతో తన పరువుకు భంగం కలిగించేలా వస్తోన్న వార్తలపై ఆమె మండిపడ్డారు. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పోస్ట్ పెట్టారు. "ఆ ఐటీ దాడులతో నాకెలాంటి సంబంధం లేదు. నేను ఆర్మీ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చా. ఇండస్ట్రీలో నాకు ఏ గాడ్‌ఫాదర్ లేరు. కేవలం నా కష్టంతోనే పైకొచ్చా. 20 ఏళ్ల వయసు నుంచే నిజాయతీగా పన్నులు చెల్లిస్తున్నా. వ్యక్తిగతంగా కానీ, ఏ నిర్మాణ సంస్థ తరపున గానీ.. నేను ఎలాంటి చట్టవిరుద్ధమైన విదేశీ లావాదేవీలు చేయలేదు. దేశంలోగానీ, విదేశాల్లో గానీ నా పేరు మీద ఎలాంటి బినామీ ఆస్తులూ లేవు. నాకు ఎవరూ ఎలాంటి ఆస్తులను బహుమతిగా ఇవ్వలేదు. ఖరీదైన కానుకలు తీసుకోవడం వ్యక్తిగతంగా నాకు ఇష్టం ఉండదు" అని రకుల్ పేర్కొన్నారు. మీడియా సంస్థలు వాస్తవాలు తెలుసుకోకుండా తనపై తప్పుడు వార్తలు రాయడాన్ని ఆమె తప్పుబట్టారు. వెంటనే వాటిని వెనక్కి తీసుకుని.. వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు.



## తప్పుడు వార్తలను వెనక్కి తీసుకోవాలి..

## వెంకటేశ్, త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం' విడుదల వాయిదా



అగ్ర కథానాయకుడు వెంకటేశ్ అభిమానులకు నిరాశ. ఆయన కీలక పాత్రలో త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందిన తాజా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం - హౌస్ నెం.47' (Aadarsha Kutumbam house no 47) విడుదల వాయిదా పడింది. నిర్మాత నాగవంశీ ఈ విషయాన్ని వెల్లడించారు. తొలుత అనుకున్న తేదీ ప్రకారం అక్టోబరు 9న ఈ మూవీని విడుదల చేయాలని చిత్ర బృందం భావించింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఇంకా పూర్తికాకపోవడం వల్ల సినిమా విడుదల వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని తెలిపారు.

అందుకు క్షమించండి..

"ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులకు తగిన సమయం లేదు. ఇలాగే విడుదల చేస్తే, మేము కూడా మీతో కలిసి నేరుగా శుక్రవారం థియేటర్‌లో సినిమా చూడాల్సి వస్తుంది. అక్టోబరు 9న మేము రావడం లేదని ముందే చెప్పి ఉంటే, వేరే సినిమాలైనా వచ్చి ఉండేవి. అలాగే ఈ నిర్ణయంతో వెంకటేశ్‌గారి అభిమానులు నిరాశ పడతారు. అందుకు క్షమించమని అడుగుతున్నా. ప్రస్తుత పరిస్థితుల్లో ట్రైలర్ కట్ చేసే సమయం కూడా లేదు. సినిమా విడుదలకు నాలుగు రోజుల ముందు వాయిదా వేయడం సబబు కాదు. ఇంకా రెండు సెట్ సాంగ్స్, ట్రైలర్ విడుదల చేయాల్సి ఉంది. ఇప్పుడు సమయం దొరికింది కాబట్టి, అన్నీ చక్కగా విడుదల చేస్తాం"

విభిన్నమైన జానర్‌లు, పాత్రలతో ప్రయోగాలు చేసిన తర్వాత.. ఒక మహిళా సూపర్ హీరో పాత్రను పోషించాలనుకుంటున్నట్లు తన మనసులోని మాటను బయటపెట్టారు బాలీవుడ్ కథానాయిక కృతిసనన్. ప్రతినాయిక ఛాయలున్న, యాక్షన్ ప్రధాన పాత్రల్లో నటించాలని కూడా కోరుకుంటున్నట్లు వెల్లడించారు. తన ఫిల్మోగ్రఫీలో వైవిధ్యమైన చిత్రాలకే చోటు ఇస్తానని పలు సందర్భాలలో చెప్పకొచ్చే ఈమె.. భవిష్యత్తులో ఎలాంటి పాత్రలు పోషించాలనుకుంటున్నారనే దాని గురించి మాట్లాడారు.

"నా సినీ ప్రయాణంలో రొమాన్స్, డ్రామా, కామెడీ.. ఇలా ఎన్నో వైవిధ్యమైన జానర్లలో కనిపించి ప్రేక్షకుల్ని అలరించా. ఇకపై మరింత సవాలుతో కూడిన పాత్రల్లోకి అడుగుపెట్టాలనుకుంటున్నా. దీంతో పాటు ఒక సూపర్ ఉమెన్ లాంటి పాత్ర చేయాలనుకుంటున్నా. ఇప్పటి వరకు ఉన్న సూపర్‌హీరోలందరూ ఎక్కువగా మగవాళ్లే. అందుకే కచ్చితంగా ఒక మహిళా సూపర్ హీరో ఉండాలని కోరుకుంటున్నా. సూపర్ హీరో జానర్‌లో నటించడమంటే నాకెంతో ఇష్టం. ఎందుకంటే నేనూ యాక్షన్ చేయాలి కదా" అని చెప్పారు కృతిసనన్.



## అలాంటి పాత్రల్లో నటించాలనుంది

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502036. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502036, EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2007/18184, CELL : 8008609999